క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర ఆలయ మండల పూజలు


విశిష్ట అలంకరణలో వెంకటేశ్వరస్వామి మూల విగ్రహమూర్తి

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని బాలుపల్లె వద్ద ఇటీవల ప్రతిష్ఠించిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో మండల పూజ ఆదివారం రుత్వికుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి మూల విగ్రహమూర్తికి లక్ష తులసి దళ అర్చన నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొట్లా తిరుమలయ్య, ఎంపీటీసీ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచ్ బొట్లా చిరంజీవి, ఆలయ కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి


హాజీపురం రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

హనుమంతునిపాడు: ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎం మాధవరావు అన్నారు. స్థానిక కంభం– కనిగిరి రహదారిలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ధ్రువీకరణ పత్రాలు తప్పక వెంట తెచ్చుకోవాలన్నారు.

ఇద్దరికి ఆర్థికసాయం


ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న మానవతా సంస్థ కమిటీ

పామూరు: మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సంస్థ కమిటీ చైర్మన్ కె.రామిరెడ్డి, అధ్యక్షుడు ఎం ముసలయ్య ఆర్థికసాయం అందజేశారు. ఇంటర్మీడియెట్‌లో 467/470 మార్కులు సాధించిన పేదవిద్యార్థి నల్లబోతుల లక్ష్మీ ప్రణవికి సైకిల్‌కోసం రూ..5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న షేక్.పాశ్చాబీకి రూ.5 వేలు సంస్థ తరుపున ఆర్థికసాయం చేశారు. సంస్థ కార్యదర్శి నేరెళ్ల బాబూరావు ఆర్థికసాయంతో రెండుచోట్ల సిమెంట్ బెంచీలు ఏర్పాటుచేశారు. తోట రమేష్, వి.వెంకటేశ్వరరెడ్డి, తూరెడ్డి వెంకటేశ్వర్లు, పి.తిరుపతిరెడ్డి, శేగు క్రిష్ణయ్య, రంగారెడ్డి పాల్గొన్నారు.

ఈదురుగాలులతో వర్షం

● విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

కనిగిరిరూరల్: కనిగిరిలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో వర్షం కురిసింది. సుమారు 8 గంటల నుంచి వర్షం కురుస్తుండటంతో ఈదురుగాలులకు విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చిరుజల్లులతో కూడిన నాన్పుడు వాన కురుస్తుండటంతోపాటు, కరెంట్ లేక చీకట్లో ప్రజలు అవస్థలు పడ్డారు. పట్టణంలోని శివారు కాలనీల్లోని రోడ్లు వర్షం ధాటికి చిత్తడిమయంగా మారాయి. రాత్రి 9.30 గంటల వరకు విద్యుత్ లేక ప్రజలు అంధకారంలో ఉన్నారు.

ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కందుకూరు రూరల్: కందుకూరు మండలంలో ఈ నెల 30వ తేదీ, జులై 1, 2వ తేదీలలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ పీ రత్నజ్యోతి ఆదివారం తెలిపారు. 30వ తేదీన కొండికందుకూరు సచివాలయంలో ఆధారం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సచివాలయానికి కొండికందుకూరు, విక్కిరాలపేట, కోవూరు పంచాయతీల్లోని ప్రజలు ఆధార్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. అదే విధంగా 1వ తేదీన పాలూరు–దొండపాడు సచివాలయంలో పాలూరు, దొండపాడు, మోపాడు, మాచవరం ప్రజలు, 2వ తేదీన పలుకూరు సచివాలయంలో పలుకూరు, మహదేవపురం పంచాయతీల్లోని ప్రజలు ఆధార్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. ఆయా పంచాయతీల్లోని పంచాయతీ కార్యదర్శులు ఆయా పంచాయతీల్లోని ప్రజలకు తెలియజేసి ఈ ఆధార్ సేవలు ఉపయోగించుకునేలా తెలియజేయాలని ఎంపీడీఓ తెలియజేశారు.

రోడ్లు ఛిద్రం.. ప్రయాణం నరకం

- అధ్వానంగా కె. అగ్రహారం, మాలపాడు, పెరికపాలెం, చెరుకూరు రహదారులు
- పెద్దపెద్ద గుంతలతో రూపం కోల్పోయిన రహదారులు
- నిత్యం ప్రమాదాలతో గాయాలపాలవుతున్న ప్రజలు
- కూటమి ప్రభుత్వంలో మాటలు తప్ప పనులు శూన్యం
- ఏడాదిగా మరమ్మతులు చేపట్టని కూటమి ప్రభుత్వం
- సరైన రహదారులు లేక అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


తారు, కంకర లేచిపోయి గుంతలు ఏర్పడిన పెరికపాలెం-చెరుకూరు రహదారి

పొన్నలూరు:

మండలంలో పైరెడ్డిపాలెం, పెరికపాలెం, చెరుకూరు, మాలపాడు, చెరువుకొమ్ముపాలెం, తిమ్మపాలెం గ్రామాలకు మంచి గుర్తింపు ఉండి ప్రత్యేక స్థానం ఉంది. అయితే ఈ గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గతంలో ఈ గ్రామాలకు వెళ్లే రహదారులను బీటీ రోడ్లుగా మార్చినా ఏడాదిగా కూటమి ప్రభుత్వంలో ఈ రహదారులు మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో ఈ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు పూర్తిగా కంకర, తారు లేచిపోయి రోడ్డుకు ఇరువైపులా కోసుకుపోయి పెద్ద పెద్ద గుంతలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఈ రహదారులపై ప్రయాణం చేయాలంటే ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు.

ప్రజలకు తప్పని అవస్థలు

వాస్తవంగా కె.అగ్రహారం సెంటర్ నుంచి మాలపాడు మీదగా వలేటివారిపాలెం మండలంలోని ప్రసిద్ధ మాలకొండ లక్ష్మినరసింహస్వామి దేవాలయానికి పొన్నలూరు, కనిగిరి, మర్రిపూడి, జరుగుమల్లి, కొండపి, పీసీపల్లి చుట్టుపక్కల మండలాల ప్రజలు, భక్తులు ప్రయాణం చేస్తుంటారు. కె.అగ్రహారం సెంటర్‌లోని ఓవీ రోడ్డు నుంచి మాలపాడు వరకు సుమారుగా 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అయితే ఈ రోడ్డు కొన్నేళ్ల క్రితం నిర్మించింది కావడంతో వాహనాల తాకిడి ఎక్కువగా ఉండటంతో పాటు అడపాదడపా వర్షాలకు పూర్తిగా కంకర, తారు లేచిపోయి రోడ్డుకు ఇరువైపులా కోసుకుపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డులో దగ్గరకు వచ్చే వరకు గుంతలు కనిపించకపోవడంతో వేగంగా వచ్చి గుంతల్లో పడి వాహనదారులు గాయాలపాలవుతున్నారు.

రూపం కోల్పోయిన పైరెడ్డిపాలెం, చెరుకూరు రోడ్డు

పైరెడ్డిపాలెం నుంచి పెరికపాలెం మీదగా చెరుకూరు వెళ్లే రహదారి మరింత అధ్వానంగా ఉంది. ఈ రహదారి సుమారుగా 8 కిలోమీటర్ల దూరం ఉన్నా ఎప్పుడో వేసిన రోడ్డు కావడంతో పూర్తిగా దెబ్బతిని కంకర్, తారు పోయి రూపమే కోల్పోయింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణం చేసే ఆరు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు ప్రతి రోజూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల ఈ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న ఆటో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లడంతో కొందరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. అప్పుడప్పుడు అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ సభలు, సమావేశాలకు ఈ రహదారులపై ప్రయాణించినప్పుడు రోడ్లు ఇంత దారుణంగా ఉన్నాయంటూ విస్తుపోతున్నారు. గ్రామాలకు వెళ్లే రహదారులను నూతనంగా నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ఏడాదిగా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నా ఆ దిశగా అడుగులు వేసిన పాపానపోలేదు. కనీసం మరమ్మతులు చేపట్టి ప్రజలకు నాణ్యమైన రహదారులను ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. .


అంచులు కోసుకుపోయి అధ్వానంగా ఉన్న కె. అగ్రహారం-మాలపాడు రోడ్డు

మరమ్మతులైనా చేయాలి:



కె.అగ్రహారం నుంచి మాలపాడు మీదగా మాలకొండకు వెళ్లే రహదారి ఏడాదిగా అధ్వానంగా ఉంది. ఈ రహదారి కొన్నేళ్ల క్రితం నిర్మించింది కావడంతో పూర్తిగా దెబ్బతింది. ఆరు గ్రామాల ప్రజలు, విద్యార్థులతో పాటు చుట్టపక్కల మండలాల ప్రజలు, వాహనదారులు, భక్తులు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. మంత్రి స్వామి స్పందించి కనీసం రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

పిల్లి తిరుపతిరెడ్డి, చెరువుకొమ్ముపాలెం

నిత్యం నరకయాతన పడుతున్నాం:



పైరెడ్డిపాలెం నుంచి పెరికపాలెం మీదుగా చెరుకూరు వెళ్లే రహదారి తారు, కంకర లేచిపోయి ఛిద్రమై గుంతలు ఏర్పడి రూపమే కోల్పోయింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు, ప్రజలు భయపడుతున్నారు. నాలుగు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వాహనదారులు ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా మరమ్మతులు చేయలేదు.

కాటా మల్లికార్జునరావు, చెరుకూరు

పీర్ల పండుగ ప్రారంభం

● పలు చావిడ్లలో కొలువు తీరిన పీర్లు

కనిగిరిరూరల్: ఇమామే హసన్, ఇమామే హుస్సేన్, ఇమామే ఖాశిం వంశీకుల త్యాగ నిరతికి ప్రతీకగా నిర్వహించుకునే మొహర్రం(పీర్ల పండుగ) వేడుకలు ప్రారంభమయ్యాయి. గురువారం చాంద్ రాత్ (మొదలు రోజు) నుంచి నియోజకవర్గంలోని పలు పీర్ల చావిడ్లలో (అషూరా ఖానాల్లో) వివిధ నామకరణాలు కల్గిన (హజరత్) పీర్లను కొలువు దీర్చారు. పట్టణంలోని మయాన మకాన్ (ఒంగోలు బస్టాండ్, పాతూరు) వద్ద ఉన్న పీర్ల చావిడిలో గురువారం రాత్రి చాంద్ రాత్ సవారి అత్యంత వైభవంగా నిర్వహించారు. బారాయిమామ్ పీరును అత్యంత నియమ నిష్టలతో, తప్పెట్ల తాశాలతో, పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. కులమత వర్గాలకతీతంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మొహర్రం సందర్భంగా పట్టణంలోని ఐదు పీర్ల చావిడ్లతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న పీర్ల చావిడ్లను (ఆషూరా ఖానా)లను ముస్తాబు చేశారు.


పీర్ల గ్రామోత్సవం(ఫైల్)

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం


వంట గదిని ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

పొన్నలూరు: ప్రభుత్వం పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావు అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలకు చెందిన 1994–95 పూర్వ విద్యార్థులు రూ. 30 వేలతో నూతనంగా నిర్మించిన వంట గది రేకుల షెడ్డును ఆదివారం ప్రారంభించారు. పూర్వ విద్యార్థులు పాలడుగు రంగారావు, నేలపాటి మాధవరావు, ఆరికట్ల ప్రసాద్, కందుకూరి కిరణ్, వరపర్ల బాలకృష్ణ, సాధు బ్రహ్మయ్య, తన్నీరు హరిప్రసాద్, కర్నా రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ నిలిపివేయాలి

కందుకూరు: ఇండోసోలార్ ప్రాజెక్టు కోసం ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో చేపడుతున్న బలవంతపు భూసేకరణ కార్యక్రమాన్ని విరమించుకోవాలని సీపీఎం నెల్లూరు జిల్లా కమిటీ సభ్యులు మూలం రమేష్ అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్న కరేడు రైతులను అరెస్టు చేయడం, మద్దతుగా వెళ్లిన నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించడం సరైన విధానం కాదన్నారు. గతంలో రోడ్డు నిర్మాణం కోసం చేవూరు ప్రాంతంలో భూములు సేకరించి నేటికి వారికి పరిహారం ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారన్నారు. రామాయపట్నం పోర్టు నిర్వాసితుల సమస్యలు నేటికి కూడా పరిష్కారం కాలేదని, మళ్లీ కరేడు రైతులను నట్టేట ముంచేందుకు ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. వెంటనే భూసేకరణ ప్రకటనను వెనక్కి తీసుకోవాలని, లేదంటే గిరిజనులు, రైతులను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమం చేసేందుకు సిద్ధమని హెచ్చరించారు. అలాగే ఆదివారం ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న మహిళల పట్ల ఉలవపాడు ఎస్సై అంకమ్మరావు దురుసు ప్రవర్తించడం దారుణమన్నారు. అలాగే ఆందోళనలో పాల్గొని అరెస్టు అయిన వారికి తమ సంఘీభావం తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంగలి పుల్లయ్య, జి వెంకటేశ్వర్లు, ఎస్‌ఏ గౌస్, పీ పెంచలయ్య, జీవీబీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహి నవరాత్రుల వేడుకలు


లక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో చండీహోమం

కనిగిరిరూరల్: స్థానిక కేటీఆర్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీ నరసింహాస్వామి ఆలయంలో వారాహి నవరాత్రులు వేడుకలు ఆదివారం అత్యంత వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కేటీఆర్ విద్యాసంస్థల అధినేత కుందురు తిరుపతిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏడాదిలో చేసింది శూన్యం


మాట్లాడుతున్న కంకణాల ఆంజనేయులు

కొండపి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. స్థానిక పెరిదేపి ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశం ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఎన్నికల్లో అలివిమాలిన హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఒక్క హామీని కూడా సక్రమంగా అమలు చేయలేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, మెగా డీఎస్సీ ప్రకటిస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడాది గడిచినా ఒక్క కొత్త ఉద్యోగం ఇవ్వలేదన్నారు. చెప్పిన హామీలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచుతూ ఆస్తి పన్ను, నిత్యవసర వస్తువుల ధరల భారాలు ప్రజల మీద మోపటం అన్యాయమన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టమన్న వారు నేడు బలవంతంగా పెట్టే ప్రయత్నం చేయడం సబబేనా అని ప్రశ్నించారు. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి ఇప్పటివరకు పొగాకు పంటను ఎందుకు కొనుగోలు చేయించలేకపోయారని ప్రశ్నించారు. జిల్లా కమిటీ సభ్యుడు కేజీ మస్తాన్ మాట్లాడుతూ సంగమేశ్వరం ప్రాజెక్టుకు ఇంత వరకు నిధులు కేటాయించలేదన్నారు. సీపీఎం మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, ఎం చిన్న పేతురు, ఎ.విశ్రాంత, అంగాలకుర్తి బ్రహ్మయ్య, వి. రూబెన్, మల్లెల పెద్ద పేతురు పాల్గొన్నారు.

వైభవంగా మహానివేదన, అభిషేకం


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు


అభిషేకంలో పాల్గొన్న ఈఓ, చైర్మన్, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహానివేదన, గోపూజ ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నారాయణస్వామి మూలవిగ్రహ మూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాలనడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలతో దుర్గంధం



మూతలు లేకుండా కోళ్ల వ్యర్థాలు తీసుకువెళుతున్న వాహనం

కొండపి: కొండపిలో కోళ్ల వ్యర్థాలను తరలించే వాహనంలో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. దీంతో ఆ వాహనం నుంచి వచ్చే దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపిలో దాదాపు 10 చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల నుంచి వ్యర్థాలు తొలగించేందుకు నిత్యం బొలెరో వాహనం వస్తుంది. అయితే ఆ వ్యర్థాలను డ్రమ్ముల్లో తొలగించే సమయంలో వాటికి మూతలు ఉండటం లేదు. ఆ వాహనం కొండపి కేంద్రం నుంచి బయటకు వెళ్లే వరకు ఆ మార్గంలోని ప్రజలు ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. కొంత మంది ఆ దుర్గంధం భరించలేక వాంతులు చేసుకున్న సంఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని కోళ్ల వ్యర్థాలు తరలించే వాహనం తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు హనీఫ్

పామూరు: కార్మికుల సమస్యలపై జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సయ్యద్ హనీఫ్, వ్యవసాయ కార్మికసంఘం సీనియర్ నాయకుడు జాలా అంజయ్య పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఖాదర్‌బాషా అధ్యక్షతన ఆదివారం జరిగిన కార్యక్రమంలో హనీఫ్, జాలా అంజయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల చట్టాలను లేబర్‌కోడ్ పేరుతో తగ్గించి పని గంటలు పెంచి శ్రామికులను దోపిడీ చేసేందుకు కుట్ర పన్నుతోందన్నారు. కార్మిక చట్టాలను కార్మికులు రక్తం చిందించి సాధించుకున్నారని, ఆ చట్టాలను కాలరాయాలని చూస్తే కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. దేశవ్యాప్త సమ్మె విజయవంతం కోరుతూ జూలై 6న బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొమ్మలపాటి మాల్యాద్రి, వై.వీరనారాయణ, సుబాని, కే.శంకర్, సీహెచ్.వెంకటేశ్వర్లు, రాజ్యం పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ కెమెరా దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న సభ్యులు

టంగుటూరు: స్థానిక కొండపి రోడ్డులోని సాయి కిరణ్ స్టూడియలో వీడియో గ్రాఫర్ల, ఫొటోగ్రాఫర్ల యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ కెమెరా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు షేక్ అమిర్‌బా, ఫొటోగ్రాఫర్ల యూనియన్ ప్రెసిడెంట్ చుండి రమేష్ , సెక్రటరీ నూతలపాటి కిరణ్, లక్కంతోటి కోటేశ్వరరావు, మదన్, కసుకుర్తి అనీలు, పసుమర్తి దేవదాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వలేటివారిపాలెం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ కె పద్మ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని శాఖవరం గ్రామంలో ఎన్‌సీడీ సర్వే నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి బీపీ, షుగర్, క్యాన్సర్ ఉన్నవారికి రక్తపరీక్షలు నిర్వహించారు. వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమాత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు ప్రతి వారం పరీక్షలు నిర్వహించుకోవాలని ఆమె సూచించారు. కార్యాక్రమంలో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ నారయణమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నీరు వృథా..తీరని వ్యథ


కందుకూరు రోడ్డు జంక్షన్ వద్ద పైపులైన్ వాల్ ద్వారా నీరు వృథాగా పోతున్న దృశ్యం



కారుస్టాండు వద్ద పైపులైన్ వాల్స్ ద్వారా నీరు వృథాగా పోకుండా ఏర్పాటు చేసిన తొట్లు

సింగరాయకొండ: మండల కేంద్రంలో రామతీర్థం పైపులైన్ వాల్స్ నుంచి నీరు వృథాగా పోతోంది. దీనిపై నీటి పారుదల శాఖ అధికారులకు కొన్ని నెలలుగా ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో పైపులైను వాల్స్ ద్వారా నీరు వృథాగా పోతుండటంతో పాటు రోడ్డుపై నిలవటంతో రోడ్డు ధ్వంసం అయి గుంతలు ఏర్పడుతున్నాయని దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

నీటిని ఆదా చేసిన కారుస్టాండ్ సిబ్బంది..

మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కారుస్టాండు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో ఆ ప్రాంతంలో కారు స్టాండు ఏర్పాటు చేసుకున్నారు. అయితే కారు స్టాండు వద్ద రామతీర్థం పైపులైను వాల్ లీకవటంతో నీరు వృథాగా పోతుండటంతో పాటు ఆ ప్రాంతం బురదమయంగా మారుతోంది. దీంతో కారు డ్రైవర్లు వినూత్నంగా ఆలోచించి నీరు వృథాగా కాకుండా ఆ ప్రాంతం బురదమయంగా కాకుండా పైపు లైను ద్వారా వచ్చే నీరు వృథాగా పోకుండా రెండు నీటి తొట్లను నిర్మించి నీరు ఆదా చేస్తూ తమ అవసరాలతో పాటు ప్రజల అవసరాలకు ఉపయోగిస్తున్నారు. దీంతో కారు డ్రైవర్లు చేసిన వినూత్న ఆలోచనను స్థానికులు అభినందిస్తున్నారు. వీరిని చూసైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ ద్వారా నీరు వృథా కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.